# హజ్ మహత్యాలు, ఆదేశాలు మరియు మర్యాదలు - (2)

## ఖుత్బాయందలి ముఖ్యాంశాలు

1. హజ్‌కు సంబంధించిన సమగ్ర ఆదేశాలు, వివరాలు.
2. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్‌కు సంబంధించి బాగా ప్రాచుర్యం పొందిన జాబిర్ (రజి అల్లాహు అన్హు) హదీసు.
3. మదీనా సందర్శన మర్యాదలు.

## మొదటి ఖుత్బా

గత శుక్రవారపు ఖుత్బాలో ఖుర్ఆన్ మరియు హదీసుల వెలుగులో హజ్ ప్రాధాన్యత, విధిత్వము, హజ్ మహత్యాలు, హజ్ ప్రయాణానికి సంబంధించిన కొన్ని మర్యాదలు, ఉమ్రాకు సంబంధించిన సమగ్ర ఆదేశాలు, వివరాలు వివరించాం. నేటి ఖుత్బాలో, హజ్ ఆదేశాలు, దాని వివరాలతో పాటు మదీనా మునవ్వర సందర్శనకు సంబంధించిన మర్యాదలను సమగ్రంగా వివరిస్తాం.

## హజ్‌కు సంబంధించిన సమగ్ర ఆదేశాలు, వివరాలు

### జిల్ హిజ్జ - 8వ తేది (యౌముత్తర్‌వియా)

మక్కా ముకర్రమ లో మీరు నివాసముంటున్న స్థలం నుంచే ఇహ్రాం కట్టుకోవాలి. ఇహ్రాం కట్టుకోవడానికి ఉమ్రా కోసం అవలంబించిన పద్ధతే హజ్ కు కూడా వర్తిస్తుంది. కనుక, పరిశుభ్రత, స్నానం ముగించి, శరీరంపై సువాసన పూసుకొని ఇహ్రాం దుస్తులు ధరించాలి.

తదుపరి 'లబ్బైకల్లాహుమ్మ హజ్జన్' అని అంటూ హజ్ గురించి సంకల్పించుకొని 'తల్బియ' పఠించడం ప్రారంభించాలి. జిల్ హిజ్జ 10 వ తేదీనాడు కంకర్రాళ్ళను కొట్టే వరకు తల్బియ పఠిస్తూనే వుండాలి. ఎందుకంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'రమీ' చేసే వరకు తల్బియ పఠిస్తూనే వున్నారు. *(బుఖారీ:1670,1685, ముస్లిం:1281)*

ఇహ్రాం ధరించాక, జొహర్ కు ముందు 'మినా' బయలుదేరాలి. 'మినా'

లో జొహర్, అసర్, మగ్రిబ్, ఇషా మరియు జిల్ హిజ్జ 9వ తేది ఫజర్ నమాజులను 'ఖసర్' చేస్తూ వాటి వాటి సమయాల్లో చదవాలి మరియు రాత్రి అక్కడే గడపాలి. ఇది దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్.

*(బుఖారీ: 1653,1655,ముస్లిం: 694,1309)*

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం:

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మినా లో మాకు జొహర్, అసర్, మగ్రిబ్, ఇషా మరియు ఫజర్ నమాజులు చేయించారు. ఆ తర్వాత అరాఫాత్ వైపుకు ప్రయాణమయ్యారు." *(తిర్మిజి: 879, సహీ – అల్‌బానీ)*

ఈ విషయాన్నే జాబిర్ (రజి అల్లాహు అన్హు) తన సుదీర్ఘ హదీసులో ఉల్లేఖించారు. *(ముస్లిం:1218)*

## జిల్ హిజ్జ 9వ తేది (యౌమె అరఫా)

అరఫా దినం (యౌమె అరఫా) ఎంతో మహోన్నతమైన దినం. ఈరోజు అరాఫాత్ లో గడపడం. హజ్ మౌలికాంశాలలో అన్నిటి కన్నా ముఖ్యమైన అంశం. అందుకే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అరాఫాత్ లో గడపడాన్ని హజ్ గా ఖరారు చేశారు.

*(తిర్మిజి:889, ఇబ్నెమాజ:3015, సహీ – అల్‌బానీ)*

ఈ దినపు మహత్యాన్ని గూర్చి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్ అరాఫాత్ దినం నాడు అత్యధికంగా తన దాసులను నరకాగ్ని నుండి విముక్తి కలిగిస్తాడు మరియు దగ్గరగా వచ్చి దైవదూతల ముందు ఇలా అడుగుతాడు: వీరేం కోరుకుంటున్నారు?"

అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆరాఫాత్ లో బస చేశారు. తదుపరి, సూర్యాస్తమయం కాబోయే సమయంలో ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) బిలాల్ (రజి అల్లాహు అన్హు) తో – ఓ బిలాల్! నిశ్శబ్దంగా వుండి నా వైపు దృష్టి సారించమని ప్రజలకు చెప్పు అని అన్నారు. దీనితో ఆయన, ప్రజలను నిశ్శబ్దం గావించగా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ప్రజలారా! ఇంతకు ముందే జిబ్రయీల్ (అలైహిస్సలాం) నావద్ద కొచ్చారు.

ఆయన నాకు, నా ప్రభువు సలాం అందజేసి ఇలా సెలవిచ్చారు – అల్లాహ్ అరాఫాత్ వాసులను, మష్అర్ వాసులను మన్నించాడు మరియు వారి హక్కుల బాధ్యతను తనపై వేసుకున్నాడు.”

దీనిపై, ఉమర్ (రజి అల్లాహు అన్హు) లేచి నిలబడి – ఓ దైవ ప్రవక్తా! ఇది కేవలం మా కోసమే ప్రత్యేకమా? అని అడిగారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – “ఇది మీ కొరకు మరియు ప్రళయం వరకు వచ్చే ప్రతి వ్యక్తి కొరకు” అని జవాబిచ్చారు.

*(సహీ అత్తర్గీబ్ వ తర్హీబ్ లిల్ అల్బానీ : 1151)*

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం:

“దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అరాఫాత్ దినం నాడు ఫజర్ నమాజు మినా లో చేశారు. తదుపరి (సూర్యోదయం తర్వాత) ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అరాఫాత్ వైపుకు ప్రయాణమయ్యారు. అరాఫాత్ చేరుకొని ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ‘నిమ్ర’ (స్థలం) వద్ద ఆగారు. అరాఫాత్ లో ఇమామ్ దిగే స్థలం ఇదే. జొహర్ సమయం కాగానే ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) దాని (జొహర్ సమయం) ఆరంభంలోనే జొహర్ మరియు అసర్ నమాజులను కలిపి చదివారు. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రజల కోసం ఉపన్యసించారు. ఆ తర్వాత అరాఫాత్‌లో బస చేశారు.” *(అబూదావూద్:1913,హసన్ – అల్బానీ)*

1) జిల్ హిజ్జ 9వ తేది, సూర్యోదయం తర్వాత తక్బీర్ మరియు తల్బియ పఠిస్తూ అరాఫాత్ వైపుకు ప్రయాణమవ్వాలి.

ముహమ్మద్ బిన్ అబూబక్ర్ అస్సఖఫీ కథనం ప్రకారం ఆయన మరియు అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) మినా నుండి అరాఫాత్‌కు వెళుతున్నప్పుడు, దారిలో ఆయన, అనస్ (రజి అల్లాహు అన్హు) తో – మీరు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో పాటు ఈరోజు ఏం పఠించేవారు అని అడగ్గా, ఆయన జవాబిస్తూ – మాలో ఒకరు తల్బియ పఠించగా అది నిరోధించ బడేది కాదు, మరొకరు తక్బీర్ పలికినా అది కూడా నిరోధించబడేది కాదు. *(బుఖారీ:1659, ముస్లిం:1285)*

అరాఫాత్ చేరుకున్నాక, అరాఫాత్ హద్దులలో వున్నామో లేదో అని

నిర్ధారించుకోవాలి. తదుపరి, మధ్యాహ్నం తర్వాత వీలైతే ఇమామ్ ఇచ్చే ఖుత్బాను వినాలి, అతనితో పాటు జొహర్, అసర్ నమాజులను ఖసర్ చేసి చదవడానికి ప్రయత్నించాలి. ఒకవేళ సాధ్యం కాకపోతే, మీ గుడారాలలోనే రెండు నమాజులను కలిపి మరియు ఖసర్ చేసి సామూహికంగా చేసుకోవాలి.

2) ఆ తర్వాత సూర్యాస్తమయం అయ్యే వరకు జిక్ర్, దుఆ, తల్బియ, ఖుర్ఆన్ పారాయణంలలో నిమగ్నమై వుండాలి. అల్లాహ్ ముందు వినయ విధేయతలు కనబర్చాలి. తమ పాపాలకు గాను మనస్ఫూర్తిగా తౌబా (పశ్చాత్తాపం) చేసుకోవాలి. చేతులెత్తి ఇహపరలోకాలలో మంచి మరియు సాఫల్యం కొరకు ప్రార్థించాలి.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“అన్నిటికన్నా ఉత్తమమైన దుఆ ఆరాఫాత్ దినపు దుఆ మరియు నేను, నాకు ముందు గతించిన ప్రవక్తలు చేసిన ఉత్తమమైన దుఆ ఇది:

“ లా ఇలాహ ఇల్లల్లాహు వహదహూ లా షరీ కలహు, లహుల్‌ముల్కు, వలహుల్ హమ్దు వహువ అలాకుల్లి షయ్యిన్ ఖదీర్.”

*(తిర్మిజి: 3585, హసన్ – అల్‌బానీ, అస్సహీహ:1503)*

3) అరాఫాత్ లో బస చేసే సమయం – మధ్యాహ్నం తర్వాత జిల్ హిజ్జ 10వ తేది ఫజర్ కు ముందు వరకు వుంటుంది. ఈ వ్యవధిలో హాజీ ఒక్క నిమిషం కోసమైనా, అరాఫాత్‌లోకి వెళితే, అతని ఈ అంశం నెరవేరుతుంది.

ఉర్వా బిన్ ముజర్రస్ బిన్ ఔస్ (రజి అల్లాహు అన్హు) కథనం:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముజ్దలిఫాలో ఫజర్ నమాజు కోసం తయారవుతున్న సమయంలో నేను ఆయన వద్దకు వచ్చి – ఓ దైవ ప్రవక్తా! నేను (తై) యొక్క రెండు పర్వతాల గుండా (ప్రయాణం చేసి) వచ్చాను. నేను నా వాహనాన్ని కష్టానికి గురి చేయటంతో పాటు స్వయంగా కూడా బాగా అలసి పోయాను. నేను (అరాఫాత్‌లో) రాతి ప్రదేశాన్ని దేనినీ వదలకుండా ప్రతిచోటా బస చేశాను. మరి నా హజ్ సరైనదేనా? అని అడిగాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“ఏ వ్యక్తి అయినా మాతో పాటు నమాజ్‌లో పాలుపంచుకొని, మేమిక్కడి

నుండి (మినాకు) బయలుదేరే వరకు మాతో గడిపి, అతను, దానికి ముందు రాత్రి లేదా పగటి వేళలో ఏదో ఒక సమయంలో అరాఫాత్‌లో గడిపివుంటే అతని హజ్ సంపూర్ణమైనట్లే మరియు అతను తన (హజ్) ఆచారాలను పూర్తి చేసిన వాడవుతాడు.” *(తిర్మిజి: 891, ఇబ్నెమాజ:3026,సహీ – అల్‌బానీ)*

అరాఫాత్ సరిహద్దులో ఎక్కడ బస చేసినా సరిపోతుంది.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“నేనిక్కడ బస చేశాను – అరాఫాత్ మైదానం అంతా బస చేయబడే స్థలం.” *(ముస్లిం : 1218)*

4) సూర్యాస్తమయం అయ్యాక ఎంతో ప్రశాంతంగా అరాఫాత్ నుండి ముజ్దలిఫాకు ప్రయాణమవ్వాలి.

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం, ఆయన, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో పాటు అరాఫాత్ దినం నాడు అరాఫాత్ నుండి తిరిగి వచ్చారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన వెనుక – వాహనాలను కొడుతూ, తీవ్రంగా కోపగించుకుంటున్న శబ్దాలు విని, తన వద్దనున్న కొరడాతో వారివైపు సైగ చేస్తూ ఇలా సెలవిచ్చారు: “ప్రజలారా! ఎంతో ప్రశాంతంగా బయలుదేరి వెళ్ళండి. ఎందుకంటే త్వరత్వరగా చేయడంలో పుణ్యం లేదు.” *(బుఖారీ : 1671)*

5) అరాఫాత్ దినం నాడు మగ్రిబ్ నమాజును అరాఫాత్‌లో కాకుండా ముజ్దలిఫా చేరుకొని ఇషా నమాజుతో జతచేసి చదవాలి.

ఉసామా బిన్ జైద్ (రజి అల్లాహు అన్హు) కథనం:

“నేను, అరాఫాత్ నుండి (బయలుదేరినప్పటి నుండి) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వాహనం పై ఆయన వెనుక కూర్చొని వున్నాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముజ్దలిఫాకు ముందు, ఎడమవైపున గల ఒక లోయలో తన వాహనాన్ని కూర్చోబెట్టారు. తదుపరి ఆయన కాలకృత్యాలు తీర్చుకున్నారు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తిరిగి రాగా, నే నాయనకు నీళ్ళు పోసాను. ఆయన తేలిక పాటి వుజూ చేసుకున్నారు. నేను – ఓ దైవ ప్రవక్తా! నమాజ్ చదువుతారా? అని అడిగాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – “ఇంకా కొంచెం ముందుకెళ్ళి నమాజ్

చదువుదాం” అని అన్నారు. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) వాహనం ఎక్కి ముజ్దలిఫా చేరుకున్నారు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజ్ చదివారు.

6) ముజ్దలిఫాలో అన్నిటికన్నా ముందుగా మగ్రిబ్ మరియు ఇషా నమాజులు జత మరియు ఖసర్ చేసి సామూహికంగా చదవాలి. తదుపరి, తమ అవసరాలు తీర్చుకొని నిద్రపోవాలి.

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మగ్రిబ్ మరియు ఇషా నమాజులను ముజ్దలిఫాలో జత చేసారు. ప్రతి నమాజుకు ప్రత్యేకంగా ఇఖామత్ చెప్ప బడింది. ఈ రెండింటి మధ్యలో గానీ మరియు వీటి తర్వాత గానీ ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎలాంటి నఫిల్ నమాజ్ చదవలేదు. *(బుఖారీ : 1673)*

7) స్త్రీలు మరియు వారితో పాటు వున్న పురుషులు, పిల్లలు, అలాగే బలహీనులు అర్ధరాత్రి దాటాక ముజ్దలిఫా నుండి బయలుదేరి మినా కు వెళ్ళవచ్చు.

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం, ఆయన ఇంట్లోని బలహీనులు ముజ్దలిఫాలో మష్అరుల్ హరాం వద్ద రాత్రి బస చేసేవారు. వారికిష్టమైనంత సేపు అల్లాహ్ స్మరణ చేసేవారు. తదుపరి, ఇబ్నె ఉమర్ (రజి అల్లాహ్ అన్హు), ఇమామ్ తన విడిది తర్వాత మినా తిరిగి వచ్చే లోపు ఆ బలహీనులను ముజ్దలిఫా నుండి త్వరగా పంపించేసే వారు. ఇలా, వారిలో ఒకరు ఫజర్ కు ముందు మినా చేరుకుంటే మరొకతను ఫజర్ తర్వాత చేరుకునే వారు. మినా చేరుకోగానే ‘జమ్రా –ఏ–అఖ్బా’ (సామాన్యంగా పెద్ద షైతాను అని పిలుస్తూ వుంటారు) ను ‘రమీ’ (కంకరాళ్ళు విసరడం) చేసేవారు. అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఇలా అనేవారు – వారికి (బలహీనులలకు) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) (ముజ్దలిఫా నుండి మినా కు ముందుగా వెళ్ళడానికి) అనుమతి ఇచ్చారు.

*(బుఖారీ: 1676, ముస్లిం: 1295)*

ఆయెషా (రజి అల్లాహు అన్హ) కథనం:

మేము ముజ్దలిఫాలో బస చేసినప్పుడు, సౌదా (రజి అల్లాహు అన్హ) –

ప్రజల రద్దీ కన్నా ముందుగానే తను మినా వెళ్ళిపోవడానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు అనుమతి అడిగారు. తను భారీ కాయం కలవారు, మెల్లమెల్లగా నడిచేవారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెకు అనుమతి నిచ్చారు. అందుకే ఆమె ప్రజల రద్దీ కన్నా ముందుగానే బయలుదేరారు. మేము మాత్రం తెల్లవారే వరకు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో పాటే వున్నాం. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో పాటే మినా కు తిరిగి వచ్చాం. ఒకవేళ నేను కూడా సౌదా (రజి అల్లాహు అన్హా) లాగా అనుమతి తీసుకొని వుంటే అది నేను సంతోషపడిన (ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) తో పాటు వుండవచ్చు అన్న) విషయం కన్నా మేలుగా వుండేది.

*(బుఖారీ:1681, ముస్లిం:1290)*

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన ఇంట్లోని బలహీనులతో పాటు ముజ్దలిఫా నుండి (మినాకు) ముందుగానే పంపించిన వారిలో నేనూ వున్నాను. *(బుఖారీ: 1678, ముస్లిం:1293)*

**కొన్ని పొరపాట్లు:**

1. అరాఫాత్ సరిహద్దుకు బయట బస చేయడం.

2. జబలె రహ్మత్‌ను అధిరోహించక పోతే ఆరాఫాత్ విడిది సంపూర్ణం కాదని విశ్వసించడం. వాస్తవానికి జబలె రహ్మత్ ఎక్కడానికి ప్రత్యేక మహత్య మేమీ లేదు. ఇలా చేయడం సత్కార్యం కూడా కాదు.

3. సూర్యాస్తమయానికి ముందుగానే అరాఫాత్ నుండి వెళ్ళిపోవడం.

4. ముజ్దలిఫా కు చేరుకున్నాక అన్నిటికన్నా ముందుగా మగ్రిబ్, ఇషా నమాజులు చదవడానికి బదులు కంకర్రాళ్ళు ఏరుకోవడం.

5. ముజ్దలిఫాలో రాత్రి నఫిల్ నమాజులు చేయడం.

## జిల్‌హిజ్జ 10వ తేది (యౌమె ఈద్)

1) ఫజర్ నమాజు ముజ్దలిఫా లో చేయాలి. తదుపరి వెలుతురు వ్యాపించే వరకు ఖిబ్లావైపుకు తిరిగి – జిక్ర్, దుఆ మరియు ఖుర్ఆన్ పారాయణంలో నిమగ్నమవ్వాలి.

2) పెద్ద జమ్రాకు కంకర్రాళ్ళు కొట్టడానికి ముజ్దలిఫాలో లావు చనగల సైజుకు సమానంగా వున్న కంకర్రాళ్ళను తీసుకోవచ్చు. కానీ, ముజ్దలిఫా లోనే తీసుకోవాలన్న నియమం ఏమీ లేదు.

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహివ సల్లం) ముజ్దలిఫా నుండి మినాకు తిరిగి వెళుతూ మినా లోని 'ముహస్సిర్' కు చేరుకున్నాక ఇలా సెలవిచ్చారు:

"రమీ చేయడానికి మీరు కంకర్రాళ్ళను ఏరుకోండి." *(ముస్లిం:1282)*

'అయ్యామె తష్రీఖ్' లో జమ్రాత్ కు కంకర్రాళ్ళు కొట్టడానికి, వాటిని (కంకర్రాళ్ళను) ముజ్దలిఫా నుండి తీసుకోవటం తప్పనిసరి కాదు. మినాలో కూడా తీసుకోవచ్చు.

3) తదుపరి సూర్యోదయానికి ముందు మినాకు ప్రయాణమవ్వాలి. దారిలో ముహస్సిర్ లోయను దాటేటప్పుడు వేగంగా నడవాలి.

4) మినా లో పెద్ద జమ్రా వద్దకు చేరుకొని తల్బియ పఠించడం ఆపేయాలి మరియు మక్కా ముకర్రమ వైపు ఉన్న పెద్ద జమ్రాకు ఏడు కంకర్రాళ్ళు, ఒక్కొక్కటిగా కొట్టాలి. ప్రతి కంకర్రాయి తో పాటు 'అల్లాహు అక్బర్' అని అనాలి. బలహీనులు, వ్యాధిగ్రస్తులైన పురుషులు, చిన్న పిల్లలు, అలాగే బలహీనులు, వయసు మీరిన స్త్రీలు కంకర్రాళ్ళను కొట్టడానికి ఇతరులను పంపించవచ్చు.

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) యౌమున్నహర్ (ఖుర్బానీ రోజు) లో చాష్త్ సమయంలో కంకర్రాళ్ళు కొట్టేవారు మరియు మిగతా రోజుల్లో మధ్యాహ్నం తర్వాత రమీ చేసేవారు. *(ముస్లిం:1299)*

అబ్దుల్లా బిన్ మస్ ఊద్ (రజిఅల్లాహు అన్హు) 'అల్ జమ్రతుల్ కుబ్రా' (పెద్ద జమ్రా) వద్దకు చేరుకొని, బైతుల్లాహ్‌ను తన ఎడమవైపుకు మరియు మినా ను తన కుడివైపుకు చేసుకొని పెద్ద జమ్రాకు ఏడు కంకర్రాళ్ళు కొట్టారు. తదుపరి ఇలా సెలవిచ్చారు: బఖర సూరా అవతరించిన వ్యక్తి (దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా ఇలాగే కంకర్రాళ్ళు కొట్టారు.

*(బుఖారీ:1748, ముస్లిం:1296)*

5) ఆ తర్వాత ఖుర్బానీ పశువును జిబహ్ చెయ్యాలి. అది ఏ లోపమూ లేనిదై, తగినంత వయస్సు కలిగినదై వుండాలి. ఖుర్బానీ కోసం పశువు యొక్క వయస్సును పట్టించుకోకుండా, ఏదైనా లోపం గల పశువులను ఉపయోగించడం సరికాదు. గురించుకోవాల్సిన విషయమేమిటంటే – మీరు ఖుర్బానీని జిల్ హిజ్జ 11 లేదా 12 లేదా 13 తేదీలలో కూడా చేయవచ్చు.

ఖుర్బానీ పశువును జిబహ్ చేశాక దాని మాంసాన్ని మీ కోసం కూడా తీసుకోండి మరియు బీదవారికి కూడా పంచిపెట్టండి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَيَذْكُرُوا اسْمَ اللَّهِ فِي أَيَّامٍ مَّعْلُومَاتٍ عَلَىٰ مَا رَزَقَهُم مِّن بَهِيمَةِ الْأَنْعَامِ ۖ
فَكُلُوا مِنْهَا وَأَطْعِمُوا الْبَائِسَ الْفَقِيرَ ﴿28﴾

**"అల్లాహ్ తమకు ప్రసాదించిన తమ పెంపుడు పశువుల మీద ఆ నిర్ణీత దినాలలో అల్లాహ్ నామాన్ని స్మరించాలి (ఉచ్చరించాలి). ఆ తర్వాత వాటిని మీరూ తినండి, దుర్భర పరిస్థితిలో ఉన్న అగత్య పరులకు కూడా తినిపించండి."** ***(హజ్ : 28)***

మీ వైపు నుంచి ఖుర్బానీ ఇచ్చే బాధ్యతను తీసుకున్న కంపనీలో కూడా డబ్బును జమ చేయవచ్చు. ఒకవేళ మీరు (హజ్ తమత్తు చేస్తూ) ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ఖుర్బానీ ఇవ్వగలిగే స్థితిలో గనక లేకపోతే అప్పుడు 10 రోజులు ఉపవాసం ఉండాలి. హజ్ దినాలలో మూడు మరియు ఇంటికి తిరిగొచ్చాక 7 రోజులు ఉపవాసం ఉండాలి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

فَإِذَا أَمِنتُمْ فَمَن تَمَتَّعَ بِالْعُمْرَةِ إِلَى الْحَجِّ فَمَا اسْتَيْسَرَ مِنَ الْهَدْيِ ۚ فَمَن لَّمْ يَجِدْ فَصِيَامُ
ثَلَاثَةِ أَيَّامٍ فِي الْحَجِّ وَسَبْعَةٍ إِذَا رَجَعْتُمْ ۗ تِلْكَ عَشَرَةٌ كَامِلَةٌ ۗ ذَٰلِكَ لِمَن لَّمْ يَكُنْ أَهْلُهُ حَاضِرِي
الْمَسْجِدِ الْحَرَامِ ۚ وَاتَّقُوا اللَّهَ وَاعْلَمُوا أَنَّ اللَّهَ شَدِيدُ الْعِقَابِ ﴿196﴾

**"ప్రశాంతతను పొంది ఉన్న స్థితిలో మీలో ఎవరైనా ఉమ్రా మొదలు కొని హజ్ వరకు సంకల్పం బూని ప్రయోజనం (తమత్తు) పొంది నట్లయితే, వారు తయ వద్ద నున్న ఖుర్బానీని ఇచ్చి వేయాలి. ఖుర్బానీ**

**ఇవ్వలేని వారు హజ్ దినాలలో మూడు రోజులు ఉపవాసం పాటించాలి. హజ్ నుండి తిరిగి వచ్చిన తరువాత ఏడు రోజులు ఉపవాసముండాలి. ఈ విధంగా మొత్తం 10 ఉపవాసాలవుతాయి. మస్జిదె హరామ్ కు సమీపంలో ఉండని వారికి మాత్రమే ఈ ఆదేశం వర్తిస్తుంది. (ప్రజలారా!) అల్లాహ్ కు భయపడుతూ ఉండండి. అల్లాహ్ కఠినంగా శిక్షించే వాడన్న సంగతిని తెలుసుకోండి."** ***(బఖర : 196)***

6) తదుపరి శిరోముండనం చేసుకోవాలి లేదా తలవెంట్రుకలన్నీ చిన్నగా కత్తిరించుకోవాలి. ముండనం చేసుకోవడం ఉత్తమం. ఎందుకంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శిరోముండనం చేసుకొనే వారి కోసం మన్నింపు ప్రార్థన (మరో ఉల్లేఖనం ప్రకారం కారుణ్య ప్రార్థన) మూడు సార్లు చేశారు, కానీ వెంట్రుకలు చిన్నగా కత్తిరించుకొనే వారికోసం ఒక్కసారే దుఆ చేశారు.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

" ఓ అల్లాహ్ ! ముండనం చేసుకున్న వారిని మన్నించు" ప్రజలు – ఓ దైవ ప్రవక్తా! వెంట్రుకలు చిన్నగా కత్తించుకున్న వారిని కూడా (ప్రార్థించండి) అని అన్నారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మళ్ళీ – 'ఓ అల్లాహ్! ముండనం చేసుకున్న వారిని మన్నించు' అని ప్రార్థించారు. ప్రజలు మళ్ళీ – ఓ దైవ ప్రవక్తా ! వెంట్రుకలు చిన్నగా కత్తిరించుకున్న వారిని కూడా (ప్రార్థించండి) అని అన్నారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మళ్ళీ – 'ఓ అల్లాహ్! ముండనం చేసుకున్న వారిని మన్నించు' అని ప్రార్థించారు.

ప్రజలు మళ్ళీ – ఓ దైవప్రవక్తా! వెంట్రుకలు చిన్నగా కత్తిరించుకున్నవారిని కూడా (ప్రార్థించండి) అని అన్నారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) నాల్గవ సారి, 'ఓ అల్లాహ్ ! వెంట్రుకలు చిన్నగా కత్తిరించు కున్న వారిని కూడా మన్నించు' అని ప్రార్థించారు. *(బుఖారీ: 1727, ముస్లిం:1301)*

అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'జమ్రా – ఏ – అఖ్బా' కు కంకర్రాళ్ళు కొట్టారు.

తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన ఒంటెల వద్ద కెళ్ళి వాటిని ఖుర్బానీ ఇచ్చారు. అక్కడే క్షవరం చేసే వాడు కూర్చొని వున్నాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన తలవైపు సైగ చేస్తూ అతనితో – (దీని) ముండనం చేయి అని అన్నారు. అతను ముందుగా కుడివైపు ముండనం చేసాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆ వెంట్రుకలను తన చుట్టు పక్కల వున్న వారికి పంచేశారు. తదుపరి ఆయన 'ఇక ఎడమవైపు ముండనం చేయి' అని అతనితో అన్నారు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అబూ తల్హా (రజి అల్లాహు అన్హు) ను పిలిచి ఆ వెంట్రుకలను ఆయన కిచ్చేశారు." *(ముస్లిం:1305)*

స్త్రీలు తమ జడ నుంచి, వ్రేలి ఒక కట్టుకు సమానంగా వెంట్రుకలు కత్తిరించుకోవాలి.

ఇలా, మీరు పాక్షికంగా హలాల్ అయిపోతారు. అంటే భార్యదగ్గరికి వెళ్ళడం మినహాయించి ఇహ్రాం స్థితిలో నిషిద్ధంగా వున్న కార్యాలన్నీ హలాల్ అయిపోతాయి. భార్య దగ్గరికి వెళ్ళడం అనేది 'ఇఫాజా తవాఫ్' తర్వాత ధర్మ సమ్మత మవుతుంది. అందుకే మీరు ఇహ్రాం దించేసి శుచి, శుభ్రతలు, స్నానం వగైరా ॥ ముగించుకొని సాధారణ దుస్తులు ధరించి 'ఇఫాజా తవాఫ్ ' కోసం కాబా గృహానికి వెళ్ళాలి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

ثُمَّ لْيَقْضُوا تَفَثَهُمْ وَلْيُوفُوا نُذُورَهُمْ وَلْيَطَّوَّفُوا بِالْبَيْتِ الْعَتِيقِ ﴿29﴾

**"ఆ తరువాత వారు తమ మురికిని దూరం చేసుకోవాలి, తమ మొక్కుబడులను చెల్లించాలి. (అనంతరం దేవుని) ఆ ప్రాచీన గృహానికి ప్రదక్షిణ చేయాలి."** ***(హజ్:29)***

7) 'ఇఫాజా తవాఫ్' అనేది హజ్ యొక్క అంశం. ఒకవేళ జిల్‌హిజ్జ 10 వ తేదీ నాడు గనక దానిని చేయలేకపోతే, తర్వాత కూడా చేయవచ్చు. స్త్రీలు ఒకవేళ అపరిశుద్ధావస్థలో గనక వుంటే, పరిశుద్ధులయ్యాక తవాఫ్ చేయాలి. ఒకవేళ వారు 'అయ్యామె తష్‌రీఖ్' (తష్‌రీఖ్ దినాలు) లలో కంకర్రాళ్ళు కొట్టిన తర్వాత పరిశుద్ధులైతే, ఈలోగా వారి తిరుగు ప్రయాణానికి సమయం ఆసన్నమైతే అప్పుడు 'ఇఫాజా తవాఫ్' చేస్తూ 'వీడ్కోలు తవాఫ్' సంకల్పం కూడా చేసుకుంటే

ఇది సరైనదే. ఒకవేళ తిరుగు ప్రయాణం వరకు పరిశుద్ధులు కాలేకపోయి, వారి బృందం కూడా వేచిచూసే పరిస్థితిలో లేకపోతే – ఈ స్థితిలో ఆమె స్నానం చేసి, బట్టను బిగుతుగా కట్టుకొని ఆ తర్వాత తవాఫ్ చేసుకోవాలి.

8) తవాఫ్ తర్వాత మఖామె ఇబ్రాహీం వెనుక రెండు రకాతులు చేయాలి. తదుపరి సఫా మర్వాల మధ్య సయీ చేసి, మినా తిరిగి వెళ్ళి పోవాలి. 11వ తేది రాత్రి మినా లో గడపడం తప్పనిసరి.

9) జిల్ హిజ్జ 10 వ తేది నాటి నాలుగు పనులు (కంకర్రాళ్ళు కొట్టడం, ఖుర్బానీ ఇవ్వడం, శిరోముండనం లేదా కత్తిరించుకోవడం, తవాఫ్ మరియు సయీ) ఏ క్రమంలోనైతే వివరించబడ్డాయో, ఆ క్రమం లోనే చేయడం సున్నత్. అయినప్పటికీ వెనుకా, ముందూ చేసి కూడా వీటిని నెరవేర్చవచ్చు.

అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజిఅల్లాహు అన్హు) కథనం ప్రకారం, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మినాలో నిలబడినప్పుడు, ప్రజలు ఆయన ( సల్లల్లాహు అలైహి వసల్లం) ను ప్రశ్నించడం మొదలు పెట్టారు. ఓ వ్యక్తి వచ్చి – ఓ దైవ ప్రవక్తా! నాకు విషయం సరిగ్గా తెలియలేదు. (దీనితో) నేను ఖుర్బానీ చేయడానికి ముందే శిరోముండనం చేసుకున్నాను అని విన్నవించుకోగా, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – వెళ్ళు, వెళ్ళి ఖుర్బానీ చేయి. దీనిలో తప్పేమీ లేదు అని వివరించారు. మరో వ్యక్తి వచ్చి – ఓ దైవ ప్రవక్తా! నాక్కూడా విషయం సరిగ్గా తెలియలేదు. (దీనితో) నేను రమీ చేయడానికి ముందుగానే ఖుర్బానీ చేశాను అని విన్నవించుకున్నాడు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అతనితో – వెళ్ళు, వెళ్ళి రమీ చేసుకో, ఇందులో తప్పేమీ లేదు అని వివరించారు.

ఆ తర్వాత దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను , ఈ పనులను వెనుకా, ముందు చేయడం గురించి ప్రశ్నించగా, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – 'వెళ్ళి చేసుకోండి, అందులో తప్పేమీ లేదు' అని జవాబిచ్చారు.

*(బుఖారీ: 1736, ముస్లిం: 1306)*

## తష్రీఖ్ దినాలు (అయ్యామె తష్రీఖ్)

*1) జిల్ హిజ్జ 11,12 తేదీల రాత్రులు మినా లో గడపడం తప్పనిసరి.*

12వ తేదీనాడు కంకర్రాళ్ళు కొట్టిన తర్వాత మినా నుండి వెళ్ళిపోవచ్చు.

కానీ 13వ తేదీ రాత్రి అక్కడే గడిపి 13వ తేదీ పగలు కంకరాళ్ళు కొట్టిన తర్వాత అక్కడి నుండి బయలుదేరడం ఉత్తమం. ఈ రోజుల్లో మూడు జమ్రాలకు కంకరాళ్ళు కొట్టాలి. దాని సమయం మద్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు వుంటుంది.

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఇబ్రాహీం ఖలీలుల్లాహ్ (అలైహిస్సలాం) ఆచారాలను పాటించడానికి రాగా, షైతాను 'జమ్రా– ఏ– అఖ్బా' వద్ద ఆయన ముందుకు వచ్చాడు. ఆయన వాడికి ఏడు కంకరాళ్ళతో కొట్టగా వాడు భూమిలోకి దిగి ద్రొక్కబడ్డాడు. తదుపరి వాడు రెండవ జమ్రా వద్ద ఆయన ముందుకు రాగా, ఆయన మళ్ళీ ఏడు కంకరాళ్ళను తీసుకొని వాడిని కొట్టగా వాడు భూమిలోకి దిగి ద్రొక్క బడ్డాడు. ఆ తర్వాత మూడవ జమ్రా వద్ద ఆయన ముందుకు రాగా, ఆయన మళ్ళీ వాడిని ఏడు కంకరాళ్ళతో కొట్టగా వాడు భూమి లోకి దిగ ద్రొక్కబడ్డాడు".

తదుపరి, ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ఇలా అన్నారు: మీరు షైతాను ను 'రజమ్' చేస్తారు మరియు మీ తండ్రి గారైన ఇబ్రాహీం (అలైహిస్సలాం) ధర్మాన్ని అనుసరిస్తారు.

*(ఇబ్నె ఖుజైమా, హాకిమ్, సహీ అత్తర్గీబ్ వ తర్హీబ్ : 1156)*

*2) అందరి కన్నా ముందుగా చిన్న జమ్రాకు ఏడు కంకరాళ్ళు, ఒక్కొక్కటిగా కొట్టాలి.*

పతి కంకరాయితో పాటు 'అల్లాహు అక్బర్' అని అనాలి. ఆ తర్వాత ఇలాగే మధ్యలో వున్న జమ్రాకు కంకరాళ్ళు కొట్టాలి. ఒకవేళ మీరు ఇతరుల వైపు నుండి కూడా కంకరాళ్ళు కొట్టాల్సి వుంటే, ముందు మీ కంకరాళ్ళను కొట్టి, ఆ తర్వాత వాళ్ళ కంకరాళ్ళను కొట్టాలి. చిన్న జమ్రా మరియు మధ్యలో వున్న జమ్రాకు కంకరాళ్ళు కొట్టిన తర్వాత, ఖిబ్లా వైపుకు తిరిగి, చేతు లెత్తి దుఆ చేయడం సున్నత్.

*3) ఆ తర్వాత పెద్ద జమ్రాకు కూడా ఇలాగే కంకరాళ్ళు కొట్టాలి. తదుపరి, దుఆ చేయడం సున్నత్.*

సాలిబ్ బిన్ అబ్దుల్లాహ్ రహిమహుల్లాహ్ ఇలా ఉల్లేఖించారు:

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) చిన్న జమ్రాకు ఏడు కంకర్రాళ్ళు కొట్టేవారు. ప్రతి కంకర్రాయితో పాటు 'అల్లాహు అక్బర్' అని పలికేవారు. తదుపరి కాస్త ముందుకెళ్ళి, సమతల ప్రదేశానికి చేరుకొని, ఖిబ్లా వైపుకు తిరిగి ఎంతో సేపు నిలబడి, చేతులెత్తి దుఆ చేసేవారు. ఆ తర్వాత మధ్యలో వున్న జమ్రాకు కంకర్రాళ్ళు కొట్టేవారు, తదుపరి ఎడమవైపుకు వెళ్ళి సమతల ప్రదేశానికి చేరుకొని, ఖిబ్లా వైపుకు తిరిగి ఎంతో సేపు నిలబడి, చేతులెత్తి దుఆ చేసేవారు. ఆ తర్వాత 'జమ్రా–ఏ– అఖ్బా' ను లోయ క్రింది భాగం నుండి కంకర్రాళ్ళు కొట్టి, అక్కడ నిలబడకుండా వెళ్ళిపోయేవారు. తదుపరి ఇలా సెలవిచ్చేవారు– నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను ఇలానే చేస్తుండగా చూశాను. *(బుఖారీ: 1751, 1752, 1753)*

*4) మూడు జమ్రాతులను కొట్టడానికి కంకర్రాళ్ళను మినా లో ఏ స్థలం లోనైనా ఏరుకోవచ్చు.*

*5) కంకర్రాళ్ళను – జమ్రాతులను లక్ష్యంగా చేసుకొని, వీలైనంత దగ్గరగా వెళ్ళి కొట్టాలి.*

*6) జమ్రాతులను – షైతాన్ గా భావించి వాటిని తిట్టడం లేదా చెప్పులు విసరడం అజ్ఞానానికి నిదర్శనం.*

*7) తష్రీఖ్ దినాలలో, ఖాళీ సమయాల్లో, అల్లాహ్ విధేయతలో గడుపుతూ, వీలైనంత ఎక్కువగా అల్లాహ్‌ను స్మరించాలి.*

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

فَإِذَا قَضَيْتُم مَّنَاسِكَكُمْ فَاذْكُرُوا اللَّهَ كَذِكْرِكُمْ آبَاءَكُمْ أَوْ أَشَدَّ ذِكْرًا ۗ

**"హజ్ క్రియలన్నింటినీ నిర్వర్తించిన తర్వాత అల్లాహ్‌ను ధ్యానించండి. మీ తాతముత్తాతలను జ్ఞాపకం చేసుకున్నట్లే. ఇంకా అంతకంటే అధికంగానే అల్లాహ్‌ను స్మరించండి." *(బఖర : 200)***

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

وَاذْكُرُوا اللَّهَ فِي أَيَّامٍ مَّعْدُودَاتٍ ۚ فَمَن تَعَجَّلَ فِي يَوْمَيْنِ فَلَا إِثْمَ عَلَيْهِ وَمَن تَأَخَّرَ فَلَا
إِثْمَ عَلَيْهِ ۚ لِمَنِ اتَّقَىٰ ۗ

**"గణించ దగిన ఆ దినాలలో ( తష్రీఖ్ దినాలలో) అల్లాహ్‌ను స్మరించండి. రెండు దినాలలోనే ఇక్కడి నుండి తిరిగి వెళ్ళేందుకు ఎవరైనా తొందరపాటు కనబరచినా తప్పులేదు. వెనుక ఉండిపోయిన వారు కూడా నిందార్హులు కారు. ఇది భయభక్తులు కలవారికై ఉద్దేశించినది."**

***(బఖర: 203)***

ఈ ఆయతు ద్వారా తెలిసిందేమిటంటే – జిల్ హిజ్జ 12వ తేదీనాడు మీరు, మినా నుండి వెళ్ళదలుచుకుంటే వెళ్ళవచ్చు. కానీ, సూర్యాస్తమయానికి ముందే కంకర్రాళ్ళను కొట్టి మినా సరిహద్దుల నుండి బయటకు రావాల్సి వుంటుంది. అలా కాకపోతే, 13వ రాత్రి అక్కడే బస చేసి, ఆ తర్వాత పగలు కంకర్రాళ్ళను కొట్టిన తర్వాత మినా నుండి వెళ్ళడం ఉత్తమం.

## కొన్ని పొరపాట్లు

1) కంకర్రాళ్ళను కడగడం.
2) ఏడు కంకర్రాళ్ళను ఒక్కొక్కటిగా కొట్టడానికి బదులు ఏడింటిని కలిపి ఒకేసారి కొట్టడం.
3) కంకర్రాళ్ళను కొట్టడంలో నిర్దేశింపబడిన సమయాన్ని పాటించక పోవడం.
4) ముందుగా చిన్నది, తరువాత మధ్యలోనిది, ఆ తర్వాత పెద్ద జమ్రాను కంకర్రాళ్ళు కొట్టే బదులు దీని క్రమాన్ని మార్చి వేయడం.
5) చిన్న మరియు మధ్యలో వున్న జమ్రాలను కంకర్రాళ్ళతో కొట్టిన తర్వాత దుఆ చేయకపోవడం.
6) పెద్ద సైజు కంకర్రాళ్ళను కొట్టడం.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చిన్న సైజు కంకర్రాళ్ళను కొట్టారు.

*(ముస్లిం : 1299)*

7) తష్రీఖ్ దినాలలోని రాత్రులలో మినాలో బస చేయక పోవడం.

## వీడ్కోలు తవాఫ్ (తవాఫుల్ విదా)

మక్కా ముకర్రమ నుండి బయలుదేరే ముందు వీడ్కోలు తవాఫ్ చేయడం తప్పనిసరి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

"అన్నిటికన్నా ఆఖరుగా బైతుల్లాహ్ తవాఫ్ చేయనంత వరకు ఎవ్వరూ తిరిగి వెళ్ళకూడదు." *(ముస్లిం:1327)*

ఒకవేళ స్త్రీలు అపరిశుద్ధావస్థలో వుంటే, వారికి వీడ్కోలు తవాఫ్ తప్పనిసరి కాదు.

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రజలకు – హజ్ ప్రక్రియల్లో వారి ఆఖరి ప్రక్రియ బైతుల్లాహ్ తవాఫ్ కావాలని ఆదేశించారు. అయితే ఈ విషయంలో, అపరిశుద్ధావస్థలో వున్న స్త్రీలకు మాత్రం (దీని నుండి) మినహాయింపు లభించింది. *(బుఖారీ: 1755, ముస్లిం:1328)*

ఈ హదీసు ద్వారా తెలిసిందేమింటంటే –

హజ్ ప్రక్రియల్లో ఆఖరి ప్రక్రియ బైతుల్లాహ్ తవాఫ్, అందుకే జిల్ హిజ్జ 12,13 తేదీలలో కంకర్రాళ్ళు కొట్టడానికి ముందుగా వీడ్కోలు తవాఫ్ చేయడం సరికాదు.

గుర్తుంచుకోవాల్సిన మరో విషయం ఏమిటంటే – వీడ్కోలు తవాఫ్ తర్వాత వెనుకడుగలు వేస్తూ మస్జిదుల్ హరామ్ నుండి బయటకు రావడం కూడా సరైనది కాదు.

అల్లాహ్ మనందరినీ స్వీకార యోగ్యమయ్యే హజ్ చేసే మహాభాగ్యాన్ని ప్రసాదించుగాక! ఆమీన్!

## దైవప్రవక్త (సల్లల్లాహు అలైహివ సల్లం) హజ్ గురించి పేరుగాంచిన జాబిర్ (రజి అల్లాహు అన్హు) హదీసు

ఇక మేము, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్ స్వరూపం గురించి ఎంతో ప్రాచుర్యం పొందిన జాబిర్ (రజి అల్లాహు అన్హు) హదీసును వివరిస్తాం.

దీనిని వివరించడంలో గల ఒక ఉద్దేశ్యం ఏమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్ స్వరూపం ఎలా వుందో తెలుసుకోవచ్చు. దీనితో పాటు మరో ఉద్దేశ్యమేమిటంటే – ఇప్పటి వరకూ వివరించబడ్డ హజ్

ఆచారాలు, ప్రక్రియలను మరోసారి నెమరువేసుకోవడం ద్వారా మరింత బాగా గుర్తుంచుకోవచ్చు.

ముహమ్మద్ బిన్ అలీ బిన్ హుసేన్ రహిమహుల్లాహ్ కథనం ప్రకారం, ఆయన, జాబిర్ (రజి అల్లాహు అన్హు) ను, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్ గురించి ప్రశ్నించగా, ఆయన ఇలా జవాబిచ్చారు:

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 9 సం॥ల వరకు (మదీనా మునవ్వర లో) వేచి ఉన్నారు. ఈ వ్యవధి లో ఆయన హజ్ చేయలేదు. 10వ సం॥ వచ్చాక ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ సం॥ హజ్ చేయ బోతున్నారని ప్రకటన గావించారు. ఇది విని మదీనా మునవ్వరలో ఎంతో మంది గుమిగూడారు. ప్రతి ఒక్కరూ – తాను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నాయకత్వంలో ఆయన లాగే హజ్ చేయవచ్చని కోరుకున్నారు. ఇలా మేమంతా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలిసి బయలుదేరాం. మేము 'జుల్ హులైఫా' కు చేరుకొనే సరికి, అస్మా బిన్తె ఉమైస్ (రజి అల్లాహు అన్హా) ముహమ్మద్ బిన్ అబూ బక్ర్ కు జన్మ నిచ్చారు. తదుపరి, ఆమె, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు–ఇప్పుడు తానేం చేయాలి? అని కబురు పంపారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెకు – 'స్నానం చేసి, బట్టను గట్టిగా బిగించి కట్టుకొని ఇహ్రాం సంకల్పం చేసుకోమని' సందేశం పంపారు.

ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మస్జిద్‌లో నమాజ్ చదివారు. తదుపరి ఆయన తన ఒంటె (ఖస్వ) నెక్కి ప్రయాణం చేస్తూ బైదా (ఒక ప్రదేశం) వద్దకొచ్చి నిలబడగా నేను చూసిందేమిటంటే – ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ముందూ, వెనుకా, కుడివైపు, ఎడమవైపు – నలుదిక్కులా, కనుచూపు మేరకు ఎటుచూసినా మనుషులే కనిపించారు. ఒకరు వాహనంపై వుంటే మరొకరు నడుస్తూ వున్నారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మా మధ్యనే వున్నారప్పుడు. ఖుర్ఆన్ అవతరణ క్రమం కూడా కొనసాగుతూనే వుంది మరియు దాని విశ్లేషణ గూర్చి కూడా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) బాగా తెలిసి వున్నారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఏ పనైతే చేశారో, మేము కూడా అదే చేశాం.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తౌహీద్‌తో ఇహ్రాం సంకల్పం చేసుకొని ఈ తల్బియ పఠించారు. "లబ్బైక అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక లాషరీ క లక లబ్బైక్, ఇన్నల్ హమ్ద, వన్నేమత, లకవల్ ముల్క్, లాషరీ కలక్"

"నేను హాజరయ్యాను, ఓ అల్లాహ్! నేను హాజరయ్యాను, నీకు భాగస్వాము లెవ్వరూ లేరు, సమస్త స్తోత్రాలు, అనుగ్రహాలు, విశ్వసామ్రాజ్యాధికారం నీ కోసమే, నీకు భాగస్వాము లెవ్వరూ లేరు".

ప్రజలంతా ఈ తల్బియానే పఠించడం మొదలుపెట్టారు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారికోసం తల్బియ లోని ఏ పదాన్నీ రద్దు చేయలేదు ( మార్చలేదు). ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) నిరంతరం ఈ 'తల్బియ' ను పఠిస్తూనే వున్నారు.

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం: మేము హజ్ కోసమే సంకల్పించు కొని వున్నాం. ఉమ్రా గురించి మాకప్పటి వరకు అసలు తెలియనే తెలియదు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలిసి మేము బైతుల్లాహ్ కు చేరుకున్నాక, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్రె అస్వద్‌కు 'ఇస్తెలాం' చేశారు. ఆ తర్వాత (మొదటి) మూడు ప్రదక్షిణలలో 'రమల్' చేశారు. మిగిలిన నాలుగు ప్రదక్షిణలు ఆయన సామాన్య వేగంతో పూర్తి చేశారు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మఖామె ఇబ్రాహీం వద్ద కెళ్ళి "మీరు ఇబ్రాహీము నిలబడిన ప్రదేశాన్ని నమాజు స్థలంగా చేసుకోండి" అన్న ఆయత్ పఠించి, దానిని – తనకూ, బైతుల్లాహ్‌కు మధ్యలో వుంచి రెండు రకాతులు నమాజ్ చేశారు. దానిలో ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాఫిరూన్ సూరా మరియు ఇఖ్లాస్ సూరా పఠించారు. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మళ్ళీ హజ్రె అస్వద్ వద్ద కొచ్చి దాని 'ఇస్తెలాం' చేశారు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) సఫా వైపుకు బయలుదేరి వెళ్ళారు. సఫా దగ్గరికి చేరుకున్నాక ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'నిస్సందేహంగా సఫా, మర్వా లు అల్లాహ్ చిహ్నాల లోనివి' అన్న ఆయత్ పఠించి ఇలా సెలవిచ్చారు:

"అల్లాహ్ ప్రారంభించిన దగ్గర్నుంచే (ప్రారంభించమని ఆజ్ఞాపించిన దగ్గర్నుంచే) నేను కూడా ప్రారంభిస్తున్నాను."

ఇలా, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) సఫా నుండి ప్రారంభించి, దానిపైకి ఎక్కి, బైతుల్లాహ్ కనిపించాక, దానివైపుకు తిరిగి అల్లాహ్ యొక్క ఏకత్వాన్ని, గొప్పతనాన్ని చాటుతూ ఇలా పలికారు:

"లా ఇలాహ ఇల్లల్లాహు వహదహూ లాషరీ కలహు లహుల్ ముల్కు వలహుల్ హమ్దు వహువ అలాకుల్లి షయ్యిన్ ఖదీర్, లా ఇలాహ ఇల్లల్లాహు వహదహు, అన్జజ వాదహు, వ నసర అబ్దహు వ హజమల్ అహ్జాబ వహద."

తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) దుఆ చేశారు.

ఇలా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మూడు సార్లు చేశారు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మర్వా వైపుకు వెళుతూ లోయ మధ్య లో ఆయన అడుగులు స్థిరపడగానే ఆయన పరుగెత్తుతూ, మర్వా కొండ ప్రారంభం కాగానే సామన్య వేగంతో నడుస్తూ మర్వా చేరుకున్నారు.

అక్కడ కూడా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) సఫా పైన చేసినట్లే చేసారు. ఇలా, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆఖరి ప్రదక్షిణ మర్వాలో పూర్తయ్యాక, ఇలా సెలవిచ్చారు:

"నాకు ఇప్పుడు తెలిసిన (తెలియ జేయబడిన) విషయం గనక ముందుగా తెలిసి వుంటే, నేను– ఖుర్బానీ కోసం పశువును తీసుకు రాకుండా దీనిని ఉమ్రాగా చేసుకొనే వాణ్ణి. అందుకే, మీలో ఎవరివద్ద నైతే ఖుర్బానీ పశువు లేదో, వారు దీనిని ఉమ్రాగా భావించి హలాల్ కావచ్చు."

ఇది విని, సురాఖ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) లేచి నిలబడి – ఓ దైవ ప్రవక్తా! ఈ ఆజ్ఞ కేవలం ఈ సంవత్సరం కోసమేనా లేక ఎల్లప్పటికా? అని అడిగారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన చేతివ్రేళ్ళను ఒకదానిలో ఒకటి పోనిచ్చి రెండు సార్లు ఇలా సెలవిచ్చారు: "ఉమ్రా, హజ్‌లో ప్రవేశించింది (కలిసిపోయింది), ఇక ఎల్లప్పుడూ ఇలాగే వుంటుంది."

(ఈ లోగా) అలీ (రజి అల్లాహు అన్హు) యమన్ నుండి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒంటెలను తీసుకొని వచ్చారు. ఆయన, ఫాతిమా

(రజి అల్లాహు అన్హా) ను – హలాల్ అయి, రంగుల దుస్తులు ధరించి, కాటుక పెట్టుకొని వుండడం చూసి, ఆమెతో–నువ్విలా చేయకుండా వుండాల్సింది అని అన్నారు. ఆమె జవాబిస్తూ – మా నాన్నగారు (ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం) దీని గురించి ఆజ్ఞాపించారు అని అన్నారు.

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం: అలీ (రజి అల్లాహు అన్హు) ఇరాక్ లో వున్నప్పుడు ఇలా చెబుతూ వుండేవారు – ఫాతిమా (రజి అల్లాహు అన్హా) చేసిన దాని గురించి ఫిర్యాదు చేయడానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్ద కెళ్ళాను. ఫాతిమ (రజి అల్లాహు అన్హా) చెప్పిన విషయం గురించి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అభిప్రాయం తెలుసుకుందామని నేను భావించాను. అంతే కాక, ఆమెతో నేను చెప్పిన విషయం కూడా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముందు ప్రస్తావించాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ: ఆమె సత్యం పలికింది, ఆమె సత్యం పలికింది అని చెప్పి, నాతో – నువ్వు హజ్ చేద్దామని నిర్ణయించుకున్నప్పుడు ఏమని సంకల్పించుకున్నావు? అని అడిగారు.

నేను – 'ఓ అల్లాహ్! నీ ప్రవక్త ఏ సంకల్పంతోనైతే ఇహ్రాం సంకల్పం చేసుకున్నారో నేను కూడా అలాగే ఇహ్రాం సంకల్పం చేసుకుంటున్నాను' అని అనుకొన్నానని, మనవి చేసుకున్నాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: నాతో పాటు ఖుర్బానీ (పశువు) వుంది. (కనుక నేను హలాల్ కాలేను), అందుకే (నాలాగే సంకల్పం చేసుకున్నావు కాబట్టి) నువ్వు కూడా హలాల్ కాలేవు.

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం: అలీ (రజి అల్లాహు అన్హు) యమన్ నుండి 100 ఒంటెలను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు తీసుకొచ్చారు. తదుపరి ప్రజలంతా హలాల్ అయ్యారు మరియు తమ వెంట్రుకలను కత్తించుకున్నారు. కేవలం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు ఖుర్బానీ (పశువులు) కలిగి వున్నవారు తప్ప.

ఇలా, 'యౌముత్తర్వియ' (జిల్ హిజ్జ 8వ తేది) వచ్చాక హజ్ సంకల్పం చేసుకొని మినా వైపుకు బయలుదేరి వెళ్ళారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా తన వాహనంపై మినా చేరుకొని, అక్కడ జొహర్, అసర్,

మగ్రిబ్, ఇషా మరియు (జిల్ హిజ్జ 9వ లేది) ఫజర్ నమాజులు చదివారు. ఫజర్ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాసేపు అక్కడే గడిపారు. తదుపరి సూర్యోదయమయ్యాక ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) (అరాఫాత్‌కు వెళ్ళి) తన కోసం 'నిమ్రా'లో ఒక గుడారం ఏర్పాటు చేయమని ఆజ్ఞాపించారు. ఆ తర్వాత ఆయన అక్కణ్ణుంచి బయలుదేరారు. అజ్ఞాన కాలంలో తాము 'మష్ అరుల్ హరామ్'లో బసచేసినట్లు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా అక్కడ బస చేస్తారని ఖురైషీయులు భావించారు. కానీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దానిని దాటుకుంటూ వెళ్ళి అరాఫాత్‌కు చేరుకున్నారు. తన కోసం 'నిమ్రా'లో ఒక గుడారం ఏర్పాటు చేయబడడం ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) చూశారు. దీనితో, ఆయన అక్కడే దిగారు. తదుపరి, సూర్యుడు (పశ్చిమం వైపుకు) వంగడం ప్రారంభించగానే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన ఒంటె (ఖస్వ)ను సిద్ధం చేయమని ఆజ్ఞాపించారు. ఆయన ఆజ్ఞ కనుగుణంగా దానిపై సీటు అమర్చబడింది. తదుపరి, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) దాని పైకెక్కి, లోయ మధ్య భాగంలోకి చేరుకొని ఖుత్బా ఇచ్చారు.... (ఈదుల్ అజ్‌హా తరువాత ఈ ఖుత్బా గురించి వివరంగా చర్చించడం జరుగుతుంది ఇన్షా అల్లాహ్).

ఆ తర్వాత (ముఅజ్జిన్) అజాన్ మరియు ఇఖామత్ పలికారు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జొహర్ నమాజు చేయించారు. తదుపరి రెండవ ఇఖామత్ పలకబడింది మరియు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అసర్ నమాజు చేయించారు. ఈ రెండు నమాజుల మధ్య ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఏ విధమైన (నఫిల్) నమాజు చేయలేదు.

ఆ తర్వాత దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన వాహనం ఎక్కి (అరాఫాత్ లో) తాను బస చేసిన స్థలానికి చేరుకున్నారు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన ఒంటె (ఖస్వ) పొట్టను రాళ్ళ వైపు చేసి, నడుస్తున్న వారిని తనకు ముందుగా చేసుకొని, ఖిబ్లా వైపుకు తిరిగి సూర్యాస్తమయం వరకు అక్కడే గడిపారు.

ఆ తర్వాత దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉసామా (రజి అల్లాహు అన్హు) ను తన వెనుక కూర్చోబెట్టుకొని ముజ్దలిఫా వైపుకు బయలు దేరారు. ఆ సమయంలో ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒంటె త్రాడును ఎంత గట్టిగా లాగి పట్టుకున్నారంటే, దాని తల– రౌతు గనక అలసినప్పుడు

కాళ్ళను ఎక్కడికైతే చాపుతాడో, అక్కడి దాకా చేరుకొంది. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన కుడి చేత్తో సైగ చేస్తూ ఇలా సెలవిచ్చారు:

"ప్రజలారా! ఎంతో ప్రశాంతంగా, సంతృప్తిగా నడవండి."

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ముజ్దలిఫా చేరుకున్నాక మగ్రిబ్ మరియు ఇషా నమాజులను ఒక అజాన్, రెండు ఇఖామతు లతో పూర్తి చేసుకున్నారు. వీటి మధ్య ఏ విధమైన (నఫిల్) నమాజుగానీ చేయలేదు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఫజర్ వేళ అయ్యే వరకు నిద్రపోయారు. ఫజర్ వేళ అయ్యాక ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అజాన్ మరియు ఇఖామత్‌లతో ఫజర్ నమాజు చేశారు. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన ఒంటె (ఖస్వ) పై ఎక్కి 'మష్‌అరుల్ హరామ్' వచ్చి ఖిబ్లా వైపుకు తిరిగి దుఆ చేశారు. అల్లాహ్ స్తోత్రం చేస్తూ, ఆయన గొప్పతనాన్ని, ఏకత్వాన్ని స్మరించారు. ఉదయం వెలుతురు వ్యాపించే వరకు ఈ స్థితిలోనే గడిపారు. ఆ తర్వాత సూర్యోదయానికి ముందే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అక్కణ్ణుంచి బయలుదేరి మినా వైపుకు వెళ్ళారు. ఈ ప్రయాణంలో ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఫజల్ బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ను తన వెనక కూర్చో బెట్టుకున్నారు. ఆయన (ఫజల్ బిన్ అబ్బాస్) సొగసైన వెంట్రుకలు కలిగివుండి ఎంతో అందంగా వుండేవారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గర నుండి స్త్రీలు వెళుతున్నప్పుడు ఫజల్ బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) వారి వైపు చూడసాగారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన చేతిని ఆయన ముఖానికి అడ్డంగా ఉంచారు. దీనితో ఆయన, తన ముఖాన్ని త్రిప్పుకొని వేరే వైపు స్త్రీలను చూడ సాగారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం), రెండో వైపు నుంచి కూడా ఆయన స్త్రీలను చూడకుండా వుండటానికి తన చేతిని ఆయన ముఖానికి అడ్డంగా వుంచారు. ఇలా తన వాహనం వేగాన్ని పెంచి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జమ్రా - ఏ-అఖ్బా వెళ్ళే దారికి మరలారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహివ సల్లం) ఒక వృక్షం దగ్గరే వున్న పెద్ద జమ్రాకు చేరుకోగానే, లోయ మధ్యలో నుండి దానికి ఏడు కంకర్రాళ్ళు కొట్టారు. ప్రతి కంకర్రాయితో పాటు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తక్బీర్ పలికే

వారు. కంకర్రాళ్ళు చిన్న సైజులో వున్నాయి.

ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖుర్బానీ ఇచ్చే స్థలం వైపుకు వెళ్ళి 63 ఒంటెలను జిబహ్ చేశారు. మిగతా వాటిని అలీ (రజి అల్లాహు అన్హు) కు ఇవ్వగా, ఆయన జిబహ్ చేశారు. తదుపరి, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రతి ఖుర్బానీ నుండి కొంత మాంసం తీయమని ఆజ్ఞాపించారు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆజ్ఞానుసారం ప్రతి ఖుర్బానీ జంతువు నుండి కొంత మాంసం తీసి ఒక పెద్ద కుండలో వేయడం జరిగింది. మాంసం ఉడికిన తర్వాత ఇద్దరూ ఆ మాంసాన్ని తిన్నారు మరియు దాని రసాన్ని త్రాగారు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) తన వాహనంపై ఎక్కి 'ఇఫాజా తవాఫ్' కోసం బైతుల్లాహ్ కు ప్రయాణమయ్యారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) బైతుల్లాహ్‌లో జొహర్ నమాజు చదివారు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) (హాజీలకు) జమ్‌జమ్ నీళ్ళు త్రాగిస్తున్న 'బనూ అబ్దుల్ ముత్తలిబ్' దగ్గరి కొచ్చి ఇలా సెలవిచ్చారు:

"ఓ బనూ అబ్దుల్ ముత్తలిబ్! మీరు బొక్కెనతో నీళ్ళు తీయండి. ఒకవేళ ప్రజలు మీ మీదకు వచ్చి పడిపోతారేమోనన్న భయం నాకు లేకుంటే, నేను కూడా మీతో పాటు నీళ్ళు తీసేవాణ్ణి (మరియు హాజీలకు త్రాగించే వాణ్ణి). తదుపరి వాళ్ళు, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు బొక్కెన అందించగా ఆయన జమ్ జమ్ నీరు సేవించారు." *(ముస్లిం:1218)*

ఇదండీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్ పద్ధతి.

మేము అల్లాహ్ ను వేడుకొనే దేమిటంటే – ఆయన మనందరినీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను అనుసరించే సద్బుద్ధిని ప్రసాదించుగాక!

## రెండవ ఖుత్బా

ప్రియ సోదరులారా!

హజ్ అయితే మక్కా ముకర్రమ లోనే సంపూర్ణమవుతుంది. అయినప్పటికీ, మస్జిదె నబవి లో నమాజ్ చదివే పుణ్యాన్ని పొందే నిమిత్తం మదీనా తయ్యబా కు ప్రయాణించడం ముస్తహబ్ (అభిలషణీయం).

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"నా ఈ మస్జిద్ (మస్జిదె నబవి) లోని ఒక్క నమాజు, ఇతర మస్జిదులలోని వెయ్యి నమాజుల కన్నా శ్రేష్ఠమైనది, కేవలం మస్జిదుల్ హరామ్ లో తప్ప."
*(బుఖారీ: 1190, ముస్లిం: 1394)*

## మస్జిదె నబవి సందర్శన మర్యాదలు

1) మస్జిదె నబవిలోకి ప్రవేశించాక 'తహ్యాతుల్ మస్జిద్' చదవాలి. ఒకవేళ వీలయితే, దానిని 'రౌజతు మిన్ రియాజిల్ జన్నహ్' లోకి వెళ్ళి చదవాలి. ఎందుకంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దీనిని స్వర్గపు ఉద్యాన వనాలలో ఒకటిగా ఖరారు చేశారు.

దీని గురించి ఇలా సెలవిచ్చారు:

"నా గృహం మరియు మింబర్ (వేదిక) కు మధ్య గల భాగం స్వర్గపు ఉద్యాన వనాలలో ఒక ఉద్యానవనం." *(బుఖారీ: 1195, ముస్లిం:1390)*

2) ఆ తర్వాత దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమాధి ముందు కొచ్చి దరూద్ మరియు సలాములు పఠించాలి. నమాజులో పఠించబడే దరూదె ఇబ్రాహీం పఠించడం ఉత్తమం. తదుపరి ఆయన సహచరులైన అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) మరియు ఉమర్ (రజి అల్లాహు అన్హు) లకు సలామ్ పలకాలి.

3) ఒకవేళ దుఆ చేయాలనుకుంటే, మస్జిదె నబవి లో ఎక్కడైన గానీ, ఖిబ్లా వైపుకు తిరిగి చేయండి.

4) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమాధి వద్ద ఆశీర్వాదం నిమిత్తం దానిపై చేతులు త్రిప్పడం లేదా దాని ప్రదక్షిణ చేయడం ఎంతమాత్రం సరికాదు.

5) పురుషులు 'బఖీ ఉల్ గర్ఖద్' (మదీనా స్మశాన వాటిక) లో ఖనన మైవున్న వారి గురించి, అలాగే ఉహద్ షహీదుల సమాధుల వద్ద కెళ్ళి వారికి సలాం పలికి వారి గురించి దుఆ చేయడం ముస్తహబ్ (అభిలషణీయం).

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన అనుచర సమాజానికి ఈ దుఆ నేర్పారు.

"ఈ ఇండ్లలో వున్న మోమిన్ మరియు ముస్లిములపై శాంతి కురియు గాక! ఇన్షా అల్లాహ్, మేము కూడా మీతో కలుస్తాం. మాపై, మీపై మరియు

మీ వెనుక ఉండిపోయిన వారిపై అల్లాహ్ కారుణ్యం అవతరించు గాక! మేము మా శ్రేయస్సు మరియు మీ శ్రేయస్సు గురించి అల్లాహ్‌ను అర్థిస్తున్నాం."

*(ముస్లిం: 974, నసాయి:2037, 2040, ఇబ్నెమాజ:1547)*

6) మస్జిదె నబవి తో పాటు మదీనా తయ్యిబాలో కేవలం ఖుబా మస్జిద్‌లో నమాజు చదవడానికి ప్రత్యేకత వుంది. ఎందుకంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్వయంగా అక్కడికి వెళ్ళేవారు మరియు అక్కడ రెండు రకాతులు నమాజు చదివేవారు.

దీని మహత్యాన్ని గూర్చి వివరిస్తూ ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఏ వ్యక్తి అయినా తన ఇంట్లో వుజూ చేసుకొని, తదుపరి ఖుబా మస్జిద్ కు వచ్చి నమాజు చదివితే అతనికి ఉమ్రా చేసినంత పుణ్యం లభిస్తుంది."

*(తిర్మిజి, నసాయి, ఇబ్నెమాజ, ఇబ్నె హిబ్బాన్, సహీ – అల్‌బానీ)*

మిగతా మస్జిదులలో నమాజు చేయడానికి ప్రత్యేకత ఏదీ నిరూపించ బడిలేదు. అందుకే పుణ్యఫలాపేక్షతో వాటిని సందర్శించడం సరైనది కాదు.

## కొన్ని పొరపాట్లు

1. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమాధిని సందర్శించే సంకల్పంతో మదీనా తయ్యిబా కు ప్రయాణమవడం.
2. హాజీల ద్వారా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు సలాములు పంపించడం.
3. ప్రతి నమాజు తర్వాత దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమాధి వద్దకు చేరుకొని దాని ముందు వినయంగా నిలబడడం.
4. దుఆ లో ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను వసీలా గా చేయడం.
5. మజ్జిదె నబవి లో 40 నమాజులను బాధ్యతగా పాటించడం (చదవడం). వాస్తవానికి ఈ విషయంలో వివరించబడే హదీసులన్నీ బలహీనమైనవి మరియు ఆధారాలుగా అయోగ్యమైనవి.

ఖుత్బా ఆఖరిలో మేము అల్లాహ్‌ను వేడుకొనేదేమిటంటే – ఆయన మనందరినీ 'మబ్‌రూర్ హజ్' (స్వీకారయోగ్యమయ్యే హజ్) భాగ్యాన్ని ప్రసాదించు గాక!